కథ

# చెత్తబ్బాయ్

- రాయప్రోలు రామచంద్రమూర్తి

**సాయంత్రం** ఆరుగంటల వేళ. పక్షులు గూటికి చేరేవేళ. మహానగరాల్లో ఉద్యోగస్తులు తమ ఇళ్ళకు బయలుదేరి, శివారు ప్రాంతాల వారైతే సగందూరంలో కూడా ఉండని సమయం. కాని చంద్రం ఆటోలో నేరుగా ఇంటి ముందు ఆగాడు. వాకిట్లో కూరలు కొంటున్న శాంత ఉలిక్కిపడింది. ఎక్కడ ఆఫీసు. ఎక్కడ ఇల్లు. 150 రూపాయలకి తక్కువవ్వదు. కూరలవాణ్ణి పంపేసి హడావిడిగా లోపలికి వెడుతున్న భర్తను అనుసరించింది. "ఏంటండీ ఆఫీసు నుంచేనా రావడం? ఎందుకు కంగారుగా ఉన్నారు?'' అనడిగింది. "ముందు నాకో గ్లాసుడు మంచినీళ్ళివ్వు. తర్వాత నన్ను కాసేపు వదిలేయ్'' అన్నాడు. అలానే చేసింది. 2 నిమిషాలాగి "ఏవండీ వసంతగారి దగ్గర పనుండి. అరగంటలో వస్తాను. మీకు కాఫీ కలిపి ఉంచాను. వేడి చేసుకుని తాగండి'' అంటూ వెళ్ళిపోయింది.

కాసేపు పక్కమీద వాలి లేచాడు. ముఖం కడుక్కున్నాడు. నెమ్మదిగా షర్టులోపలి జేబులోపలి నుంచి వెయ్యి రూపాయల నోట్లకట్ట తీసి ఒక్కొక్కటి నెమ్మదిగా లెక్కపెట్టాడు. మొత్తం పదిహేను తీసుకెళ్ళి తన పర్సనల్ బాక్స్‌లో పెట్టుకున్నాడు. దానిమీద అతనొక్కడికే అజమాయిషీ ఉంది. ఇప్పుడు గుండె కుదుట పడింది. కాఫీ కోసం వంటింట్లోకి వెడుతుండగా గేటు చప్పుడైంది. 'ఎవరా' అని చూస్తే కాలనీలో రోజూ రిక్షాలో చెత్త తీసుకెళ్ళే 'చెత్తబ్బాయ్'! "సార్ ఒక్క నిమిషం'' చెయ్యి ముందుకు చాపి అన్నాడు. ఏ పండగ మామూలుకో వచ్చుంటాడు. "ఇప్పుడు పనిలో ఉన్నాను. తర్వాత రా'' అన్నాడు. ప్రస్తుతానికి తప్పించుకుంటే తర్వాత సంగతి తర్వాత అన్న ఆలోచనతో. పది నిముషాలైందో లేదో మళ్ళీ "సార్'' అని పిలుపు. మనసు కుదుటు పడినా ఎవరితోనూ మాట్లాడాలని లేదు. "ఏమయ్యా విసిగించకు. నాకు ఒంట్లో బాగోలేదు. వెళ్ళిపో'' తీవ్ర స్వరంతో అరిచాడు. చేసేదేమి లేక వెనుదిరిగాడు చెత్తబ్బాయ్.

కాసేపటికి శాంత, కూతురు శిల్ప వచ్చారు. కూతురు నేరుగా తన 'స్టడీ రూమ్'కి వెళ్ళిపోయింది. "ఏవండీ! ఇప్పుడు బావున్నారా? ఎందుకు ఆటోలో వచ్చారు?'' అడిగింది శాంత. అన్నీ చెబుతాను. వంట త్వరగా కానీ. బాగా ఆకలేస్తోంది. ఔనూ అమ్మాయి పలకరించకుండా గదిలోకి వెళ్ళిపోయింది. రోజూ హాయ్ డాడీ అని దగ్గరికి వచ్చి మరీ చెప్తుంది'' అన్నాడు చంద్రం. "మేం కూడా అన్నీ తర్వాత చెప్తాం లెండి'' అంది శాంత.

8 గంటలకి కొడుకు శ్రావణ్‌తో సహా అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర చేరారు. "భోజనాలు మొదలుపెట్టే ముందు మీ అందరికీ గుడ్ న్యూస్ - మా ఆఫీసు బస్ స్టాండ్‌లో నించుని ఉండగా కొద్దిగా ఎరుపు రంగులో ఉన్న కాగితం కనిపించింది. అనుమానం వచ్చి తీసి చూస్తే కాగితం కాదు. కట్ట. నోట్ల కట్ట. రబ్బర్‌బాండ్‌తో కట్టిన వెయ్యి రూపాయల నోట్ల కట్ట. చప్పున జేబులో పెట్టేసుకున్నాను. చుట్టూ చూశాను. అంతా మా ఆఫీసు వాళ్ళే. ఒక్క పూరాయన ఆయన కూతురు తప్ప! మన శిల్ప వయసే ఉంటుంది. వాళ్ళదే అయ్యుంటుంది. అట్లా అని మీదా అని అడిగితే ఎవరైనా మాదే అంటారు. ఐనా అజాగ్రత్తగా ఉన్నందుకు అనుభవించక తప్పదు. వెంటనే ఆటో చేసుకుని వచ్చేశాను. దారిలో లెక్కపెట్టాను. ఇంటికి వచ్చి లెక్క చూశాను. నిండా 15 నోట్లు. అంటే 15 వేలు. హహ్హా'' అన్నాడు. "ఔను మీరేదో చెప్తానన్నారు? ఇంత ఆనందకరమైన విషయం చెప్పినా ఎవరూ పెద్దగా ఆనందించట్లేదు?'' మళ్ళీ అడిగాడు. "భోజనాలు కానీండి ముందు'' అంది శాంత. తర్వాత నెమ్మదిగా చెప్పింది. "శిల్పకి అది ఈ మధ్యే పెద్దదైనప్పుడు చేయించిన చెయిన్ కనిపించడం లేదు. అది నిన్న, ఇవాళ ఎక్కడెక్కడికి వెళ్ళిందో అన్ని చోట్లకీ వెళ్ళాం. మధ్యాహ్నం నుంచి తిరుగుడే తిరుగుడు. శ్రావణ్ కూడా

తిరిగాడు. ఫలితం లేదు. 30 వేల వస్తువు పోయి, 15 వేలు దొరికితే ఆనందం ఏం ఉంటుంది?''

"ఓర్నాయనోయ్ కొంప ముంచింది. ఏవేఁ శిల్పా! ఏంటా అజాగ్రత్త. ఎవరికి దొరికిందో ఏవోఁ తెచ్చిస్తాడో లేదో."

"డాడీ! ఇందాక నువ్వు చెప్పిన ప్రకారం అజాగ్రత్తగా ఉన్నందుకు మనం కూడా అనుభవించక తప్పదేమో'' అన్నాడు శ్రావణ్. "ఉండరా అపశకునం పలకకు'' అని చంద్రం అంటూండగా మళ్ళీ గేటు చప్పుడైంది. మళ్ళీ చెత్తబ్బాయ్. ఈసారి కాలనీ సెక్రెటరీ కూడా. ఇహ బయటికి వెళ్ళక తప్పలేదు. చంద్రం గారూ లోపల కూర్చుని మాట్లాడుదామా?'' అన్నారు. విషయం అర్థం కాక " సరే రండి'' అని లోపల కూర్చున్నారు.

"ఇతను సూరయ్య తెలుసుగా మన కాలనీ చెత్త తీసుకెడతాడు. నిన్న చెత్త తీసుకెళ్ళి 'డంపింగ్' చేస్తూంటే ఏదో మెరుస్తున్నట్లనిపిస్తే తీసి చూడగా చెయిన్ కనిపించింది. బంగారందే అని తెలుసుకున్నాక....''

"సెక్రటరీ గారూ ఆ చెయిన్ మాదే. మా అమ్మాయి పోగొట్టుకుంది'' మధ్యలోనే కల్పించుకుంటూ ఆతృతగా అన్నాడు చంద్రం.

"అక్కడే వచ్చిందండీ ప్రాబ్లం. నిన్న సాయంత్రం సూరయ్య తిరిగొచ్చాక మన కాలనీ స్త్రీలు కొందరు మాట్లాడుకుంటూంటే ఎవరిదైనా బంగారు గొలుసు పోయిందా అంటే ఉన్న నలుగురిలో ముగ్గురు మాదే అన్నారట. గుర్తులు సరిగా చెప్పలేకపోవడంతో ముగ్గురూ అబద్ధం చెప్పారన్న విషయం తెలిసిపోయింది. అన్ని ఇళ్లూ కవర్ అయినా మీ ఇంటికి మధ్యాహ్నం 2 గంటలకి 3 గంటలకి రెండు సార్లు వచ్చాడట. తాళం వేసి ఉంది. ఆరున్నర, ఏడు ప్రాంతాల్లో రెండుసార్లు వచ్చాట్ట. మీరు పెద్దగా అరిచేసరికి నా దగ్గరికి వచ్చి విషయం చెప్పాడు. ఇక తప్పని సరై నేను రావాల్సి వచ్చింది'' అన్నారు సెక్రెటరీ.

"ఓహ్ క్షమించండి సార్. అప్పటికి చెయిన్ పోయిన సంగతి నాకు తెలీదు. కేకలేస్తానని మావాళ్ళు చెప్పి ఉండరు. ఇతను పండగ మామూలుకి వచ్చేడేమోనని పంపేశాను. ఉండండి మా అమ్మాయిని పిలుస్తాను. శిల్పా ఇట్రా''

"ఏంటి డాడీ....''

"నీ చెయిన్ గుర్తులు చెప్పమ్మా....''

"మామిడి పిందెల డిజైన్. లాకెట్ పైన 'క' అంటే శిల్ప అనే అక్షరం ఎఱ్ఱటి రాళ్ళతో రాసివుంది. వెనక హుక్ పైన హాల్‌మార్క్ గుర్తు వుంది. ఉండండి బిల్ తెస్తాను... ఆఁ... మూడు తులాల ఒక గ్రాము 27 మిల్లీ గ్రాములు ఇదిగోండి బిల్'' సెక్రెటరీ చేతికి అందించింది.

"ఓకే... గుర్తులు సరిపోయినయ్. తీసుకోమ్మా! కంగ్రాచ్యులేషన్స్. మీ విలువైన వస్తువు మీకు దొరికింది. అసలు ఎలా పోయిందో''

"అంకుల్ నాకు జ్ఞాపకం వచ్చింది. నిన్న బ్రష్ చేసుకున్నాను చెయిన్ కూడా కడుగుదామని సబ్బురాసి 'వాష్ బేసిన్ పైన పెట్టాను. ఈలోపల మా ఫ్రెండ్ ఫోన్ చేస్తే చాలా సేపు మాట్లాడాను. సబ్బు పూసి ఉండడం వల్ల మేం 'వాష్ బేసిన్' కింద వాడేసిన పేస్ట్, సబ్బుల డబ్బాలు పడేయడానికి ఉంచిన 'డస్ట్ బిన్'లో పడి ఉంటుంది. సూరయ్య వచ్చినప్పుడు నేనే 'డస్ట్-బిన్' అతనికి ఇచ్చి వచ్చాను. కాని చెయిన్ విషయం మరచిపోయాను. పాపం సూరయ్య మాకోసం మధ్యాహ్నం వచ్చినప్పుడు మేం ముగ్గురం మా కాలేజీలో, ఇంటర్‌నెట్ సెంటర్‌లో, బేకరీలో, కంప్యూటర్ సెంటర్ ఇలా నేను తిరిగిన చోట్లన్నీ వెతికాం. అందుకే ఇంట్లో లేం. థ్యాంక్యూ సూరయ్యా... డాడీ! సూరయ్యకి ఏదైనా ఇవ్వండి.''

"ఆఁ ... సూరయ్య నువ్వు చాలా మంచి వాడివి. ఇదిగో అని పదిరూపాయలు చేతిలో పెట్టాడు. అక్కడున్న వారంతా నిర్ఘాంతపోయారు. శాంత భర్తని లోపలికి పిలిచి "మీ కేమన్నా బుద్ధుందా. 30 వేల వస్తువు తిరిగిస్తే 10 రూపాయలా మీరిచ్చేది'' అంది నిష్ఠూరంగా. "మమ్మీ మీరు గొడవ పడకండి. నేను మూడు వందలు అంటే కేవలం వన్‌పర్సంట్ ఆఫ్ చెయిన్ వాల్యూ ఇచ్చేశాను. వాళ్ళు వెళ్ళిపోయారు'' అంది శిల్ప.

"ఘనకార్యం చేశావ్ గాని ఇక నుంచైనా జాగ్రత్తగా ఉండు'' అంటుండగా మళ్ళీ గేటు చప్పుడైంది. పొరుగున ఉండే ఆఫీసు కొలీగ్ సాయి. "ఏవయ్యా చంద్రం ఆఫీసు నుండి ఆటోలో వచ్చేశావు. నేను పిలుస్తూనే ఉన్నా

వినిపించుకోలేదు. సడన్‌గా ఇల్ అయ్యావేమో కనుక్కుందామని వచ్చా."

"ఆఁ అదేనోయ్. కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. అందుకని ఆటో ఎక్కి వచ్చేశా. ఔను నీకేవిఁటి తొమ్మిదైంది?"

"నువ్వెళ్ళిన కాసేపటికి ఒక ఊరతను, అతని కూతురు కంగారుగా ఏదో వెదుకుతూ కనిపించారు. విషయం ఆరా తీస్తే ఊరి నుంచి అతని 6 ఏళ్ళ కూతురికి గుండె ఆపరేషన్ కోసం ఇక్కడికి వచ్చాడట. ఎం.జి.బి.ఎస్ కొచ్చే ఊరి బస్సులు లక్డీకాపూల్ దగ్గర కూడా ఆగుతాయ్ కదా. అక్కడి నుంచి ఆపోలోకెళ్ళాలని నించున్నాడు. పాపం డబ్బుకూడా జాగ్రత్త పెట్టుకోలేని అమాయకత్వం. ఏడుస్తూ ఇద్దరూ అందరికీ చెబుతున్నారు. ఋజువుగా పాపం తెల్లకార్డువారికి ప్రభుత్వం గుండాపరేషన్లకి సహాయం చేస్తోందని ఎవరికైనా 15వేలు దొరికితే ఇవ్వండని ప్రాధేయ పడుతున్నారు. జాలి అనిపించి నేనూ వెతికాను. లాభం లేకపోయింది. పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళి రిపోర్టు ఇప్పించి వచ్చేసరికి ఆలస్యం అయింది. సరే ఉంటా..." అంటూ సాయి వెళ్ళిపోయాడు.

విషయం విన్న కుటుంబ సభ్యులు "హమ్మయ్య ఎవరి సొమ్ము వారికి చేరుతోంది. రేపు తీసుకెళ్ళి డబ్బిచ్చేయండి" అన్నారు. "సరే" నని తలూపాడు.

కాని మర్నాడు ఆ డబ్బు పోలీస్ స్టేషన్ చేరలేదు. చంద్రం బ్యాంకు ఖాతాలోకి వెళ్ళింది. చంద్రుడికి స్వయం ప్రకాశత్వం లేదు. కనీసం సూర్యుడి నుంచైనా శక్తిని గ్రహించి ప్రకాశిస్తాడు. మానవత్వంలేని ఈ చంద్రం సగం జీవితం చెత్తలోనే గడిపినా సూరయ్య లాంటి నిజాయితీ ఉన్న వ్యక్తి నుంచి దాన్ని గ్రహించి ఐనా సరే మనసులో మానవత్వం అనే దీపాన్నైనా వెలిగించుకోలేనివాడు ఈ అసలైన 'చెత్తబ్బాయ్'.

**(సంక్రాంతి సందర్భంగా 'రంజని' నిర్వహించిన కీ.శే. రాయప్రోలు రామక్రిష్ణయ్య గారి స్మారక కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ)**

## ఉగాది వైశిష్ట్యం

ఆంధ్రులు తమ సంత్సరాదిని చాంద్రమాన పరిగణననమునసే నిర్ణయించుకొంటారు.
చాంద్రమాన సంవత్సరము చైత్రశుక్ల ప్రతిపత్తుతో ప్రారంభమౌతూ ఉంది.

శాస్త్రీయ, లౌకిక ఆధారాలను బట్టి చైత్రమాసాదే ఆర్యుల సంవత్సరాదిగా నిర్ణయంచేయతగి ఉంది.

చైత్రశుక్ల పాడ్యమి సంవత్సరాది అని బ్రహ్మపురాణం కంఠోక్తిగా చెబుతోంది.

వసంతకాలారంభంలో చైత్ర శుక్ల పాడ్యమి నాడు సంవత్సరాది పర్వం జరిపే ఆచారం ఆర్యులలో అతి ప్రాచీన కాలం నుంచీ ఉన్నట్లు కనిపిస్తుంది. మన ఉగాది పర్వదినమే కొంచెం ఇంచుమించుగా పార్సీకుల కునూ ఏడాది పండుగ అయి ఉంది. అగ్ని పూజకులగు పార్సీల ఉగాది మన ఉగాదితో జత పరచుచూ ఉండడంవలన ఒక విషయం ఊహింప నగుచున్నది. ఆర్యులు, పార్సీలు కలసి ఉండిన కాలమునే ఈ పర్వం ఏర్పడి ఉండునని పార్సీలు ఉగాదిని 'నౌరోజ్' అంటారు. నౌరోజ్ అనగా కొత్త దినము అని అర్థము.